క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. చెన్నారెడ్డినగర్ ఫీడర్ పరిధిలో దుర్గానగర్, పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, అహ్మద్‌నగర్, సమోసా ఖార్కానా, బిస్మిల్లా హోటల్ తదితర ప్రాంతాల్లో 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు జిందా తిలిస్మాత్ ఫీడర్ పరిధిలో శంకర్‌నగర్, దుర్గానగర్, అన్నపూర్ణనగర్ తదితర ప్రాంతాల్లో 2.30 గంటల నుంచి 5 గంటల వరకు, తిలక్‌నగర్ ఫీడర్ పరిధిలో తిలక్‌నగర్ క్రాస్‌రోడ్డు, ఛే నెంబర్ క్రాస్ రోడ్డు, అంబర్‌పేట్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో 2 గంటల నుంచి 4 గంటల వరకు, సంజీవయ్యనగర్ ఫీడర్ పరిధిలో తిలక్‌నగర్, మీసేవా, శివాలయం టెంపుల్ తదితర ప్రాంతాల్లో 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

గవర్నర్ తమిళిసైకి బైబిల్ అందజేత



సీఎం కేసీఆర్, రాష్ట్ర గవర్నర్‌కు బైబిల్ అందజేస్తున్న శంకర్‌లూక్

ముషీరాబాద్: రాష్ట్ర సచివాలయంలో నూతనంగా నిర్మించిన చర్చిని ప్రారంభించిన సీఎం కేసీఆర్, రాష్ట్ర గవర్నర్ తమిళిసైలకు బైబిల్ గ్రంథాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ బి.శంకర్‌లూక్ తదితరులున్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు



కాచిగూడ: స్ట్రీట్‌లైట్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి స్థానిక ప్రజలు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కాచిగూడ, నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్, మోతిమార్కెట్, తదితర ప్రాంతాల్లో వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక బస్తీల్లో పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌దీపాలు లేని ప్రాంతాల్లో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. శివ, శరత్, బీమ్ రాజ్, సూరి, ఎస్.రవియాదవ్, ఓంప్రకాష్, రామకృష్ణ, ఆర్.సంతోష్ తదితరులున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలపై స్పెషల్ డ్రైవ్

ముషీరాబాద్: ప్రమాదాలను నివారించేందుకు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతామని చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి తెలిపారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని అంజుమన్ స్కూల్ ప్రాంగణంలో భోలక్‌పూర్‌లోని ఐరన్, ప్లాస్టిక్, స్క్రాబ్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో స్క్రాబ్ దుకాణాల్లో మూడు, నాలుగు ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహించడంతోనే ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రమాదాలను నివారించేందుకే స్పెషల్ డ్రైవ్‌ను చేపడుతున్నామన్నారు. ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్, కార్పొరేటర్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్, బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్రనాయకులు షరీఫ్, నాయకులు సబీల్, ఆమెల్, ఎంఐఎం పార్టీ నాయకులు నూరుల్ హసన్, షరీఫ్, ఎస్సైలు స్వప్న, సీపీరెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

ముగిసిన హరినాథ్‌గౌడ్ అంత్యక్రియలు

ముషీరాబాద్: అస్తమా, ఉబ్బసం వ్యాధి గ్రస్తులకు ప్రతి ఏటా మృగశిరకార్తి రోజున ఉచితంగా చేప ప్రసాదం పంపిణీ చేసే బత్తిని హరినాథ్‌గౌడ్ అంత్యక్రియలు ముగిశాయి. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ పరిధిలోని పద్మశాలీ కాలనీలోని బత్తిని హరినాథ్‌గౌడ్ నివాసం నుంచి కుటుంబసభ్యుల అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రలో పెద్దఎత్తున గౌడ సంఘాల నాయకులు, కుటుంబసభ్యులు, స్థానికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వరలక్ష్మి దేవీ నమోస్తుతే

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ బృందం: శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా స్థానిక శంకరమఠంలో శారదా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముత్తైదువులకు వాయినం ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో మహిళలతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం, మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు. అంబర్‌పేటలోని మహంకాళి అమ్మవారి ఆలయం, బతుకమ్మకుంట మైసమ్మ ఆలయం, గోల్నాక దుర్గానగర్‌లోని మైసమ్మ ఆలయం, గోల్నాక నల్లపోచమ్మ అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ వరలక్ష్మీ వ్రతం వేడుకలను కాచిగూడ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. లలితాదేవి, ఉమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ముషీరాబాద్ వద్దనున్న శృంగేరి పీఠ జ్ఞాన సరస్వతి ఆలయానికి శుక్రవారం భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయ దర్మాధికారి కళాజనార్దనమూర్తి పలువురు భక్తుల సహకారంతో రూపొందించిన దేవికి స్వర్ణముఖం, రజతజడ, వస్త్రం, ధారపాత్రతో పాటు రెండు వెండి ఏనుగులను అర్చకులకు అందజేసి అలంకరింపజేశారు. శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి, విదుశేఖర భారతిస్వామి ఆశీస్సులతో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు సదుపాయాలు కల్పిస్తామన్నారు. జ్వాల నరసింహేశ్వర్ వైకుంఠం, కామేశ్వరమ్మ, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మకుంట మైసమ్మ అమ్మవారు



బీజేపీ నాయకురాలు కె.గీతామూర్తి



బహుకరిస్తున్న ఆలయ ధర్మాధికారి కళాజనార్దన మూర్తి

దివంగత మేయర్ కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నగర తొలిమేయర్‌గా దివంగత నేత కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో గోల్నాకలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కృష్ణస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కృష్ణస్వామి నగరానికి తొలిమేయర్‌గా బాధ్యతలు నిర్వహించి చారిత్రాత్మక అభివృద్ధి పనులు చేపట్టారని కొనియాడారు. నియోజకవర్గంలో ముదిరాజ్‌లకు సామాజిక భవనం ఏర్పాటు చేయాలన్నారు. అంబర్‌పేట జ్యోతిరావు పూలే చౌరస్తా, ఛే నెంబర్ చౌరస్తాలో కృష్ణస్వామి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. మూసారాంబాగ్ బ్రిడ్జికి కృష్ణస్వామి పేరు పెట్టాలని ప్రతిపాదించారు. సానుకూలంగా స్పదించిన ఎమ్మెల్యే మంత్రి తలసానితో చర్చించి ప్రతిపాదనల అమలుకు కృషి చేస్తానన్నారు. మాజీ మంత్రి కృష్ణయాదవ్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాములు, రోహిత్, లల్లు, లలిత, మహేందర్, దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు 20 అసెంబ్లీ సీట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా మున్నూరుకాపు అభ్యర్థులను గెలిపించాలని అపెక్స్ కమిటీ ప్రతినిధులు, రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడుతూ త్వరలోనే నగరంలో మున్నూరుకాపుల ప్లీనరి భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈనెల 27న నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో ప్లీనరీ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన మున్నూరుకాపులకు అన్ని రాజకీయ పార్టీలు కనీసం 20 ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలన్నారు. రమేష్‌కుమార్, రవీందర్, శ్రీనివాస్‌రావు, భాస్కర్, రవికాంత్, హజారి రాంమోహన్ తదితరులున్నారు.

‘మేరా మిటీ మేరా దేశ్’కు మట్టి సేకరణ

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ‘మేరా మిటీ మేరా దేశ్’ కార్యక్రమంలో భాగంగా దేశం నలువైపుల నుంచి భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో వివిద జిల్లాలు, ప్రాంతాల నుంచి మట్టిని సేకరించినట్లు రాష్ట్ర కార్యదర్శి మంచాల వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ హెడ్‌క్వార్టర్స్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి సేకరించిన మట్టిని నేషనల్ హెడ్‌క్వార్టర్‌కు పంపించినట్లు ఆమె వివరించారు. పరమేశ్వర్, అనంతలక్ష్మి, ప్రమోదిని, బీఎస్‌జీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి, వివిధ జిల్లాల స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో పాల్గొన్న ప్రతినిధులు

యువత ఉపాధివైపు పయణించాలి



ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత ఉపాధి వైపు పయణించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్థసారథి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం భర్కత్‌పుర సంయుక్తాధ్వర్యంలో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ సహకారంతో పేద విద్యార్థులకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విస్తృతం చేయడం ద్వారా నిరుద్యోగ సమస్య తీరుపోతుందన్నారు. సంవర్ధన సమితి అధ్యక్షులు కృష్ణారెడ్డి, కె.ఉపేందర్, కోశాధికారి ఆర్.రామచందర్, సునీల్ కులకర్ణి, పరమేశ్వర్‌గుప్తా, చంద్రమౌళి తదితరులున్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

ముషీరాబాద్: రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందని దీనికి బీజేపీ క్యాడర్ కష్టపడి పని చేయాలని అస్సాం బీజేపీ ఎమ్మెల్యే పరమానంద బిష్వేయ్ ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్ రామ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మైనార్టీ సోదరులు మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో పలువురు మైనార్టీ నాయకులు బీజేపీ పార్టీలో చేరగా.. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఎమ్మెల్యే పరమానంద ఆహ్వానించి మాట్లాడారు. పూసరాజు, జి.సూర్యనారాయణశర్మ, సలాంద్రి శ్రీనివాస్‌యాదవ్, సీ.కే.శంకర్, కన్వీనర్ రమేష్‌రామ్, డివిజన్ అధ్యక్షుడు నరేష్, కొడన్య ప్రసాద్, బాబు, సుబ్రహ్మణ్యం, రఘు, రాజు, శేషసాయి తదితరులున్నారు.

దర్గాలో ఛాదర్ సమర్పణ

ముషీరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ ఘన విజయం సాధించాలని కోరుతూ.. అడిక్‌మెట్ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు అబ్బూ, ఉపాధ్యక్షుడు మహ్మద్ బషీర్‌ల ఆధ్వర్యంలో షరీఫ్‌దర్గాలో ఛాదర్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమర్పించారు. ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహా, మనోహర్‌సింగ్, మహ్మద్ ఖదీర్, సయ్యద్ యూనూస్, షేక్ మహ్మద్, దునేద్ బాగ్దాది, ఖాజా, ఆజామ్, ఎంఏ వాహేబ్, ఇక్బాల్, రవియాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల శ్రీనివాస్, శ్రీను తదితరులున్నారు.



నటి కృష్ణవేణికి జమున సాఫల్య పురస్కారం

చిక్కడపల్లి: అలనాటి సినీనటి నిర్మాత కృష్ణవేణికి ప్రముఖ నటి జమునారమణారావు జీవిత సాఫల్య పురస్కారం వంశీ సంస్థల పక్షాన బహుకరిస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం వంశీ రామరాజు జమున కుమార్తె స్రవంతి జూలూరి, మనవడు అవినాష్‌తో కలసి శుక్రవారం తెలిపారు. ఆరోగ్యరీత్యా కృష్ణవేణి బహిరంగ సభలకు రలేనందున ఈ నెల 27న ఫిల్మ్‌నగర్‌లోని ఆమె స్వగృహంలో పురస్కారం అందజేస్తామని ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, నిర్మాత రామ సత్యనారాయణ అతిథులుగా పాల్గొంటారన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు రిజర్వేషన్లు

చిక్కడపల్లి: బీపీ మండల్ భారతదేశంలోనే మూడువేలకు పైగా వెనుకబడిన కులాలను ఆర్థిక, సామాజికంగా విద్య, సాంస్కృతికంగా అధ్యయనం చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలో బీపీ మండల్ 105వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 27 శాతం బీసీలకు విద్య, సామాజిక, ఆర్థిక రిజర్వేషన్లు కల్పించాలని నివేదికను ఇచ్చారన్నారు. 1994లో ప్రధానమంత్రిగా ఉన్న పీవీ నరసింహారావు హయాంలో 27 శాతం బీసీలకు రిజర్వేషన్ దక్కిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జీఎన్ కేశవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీఎన్ చారి, నవీన్, సత్యనారాయణ, చందు, గణేష్, రవి, సాయిబాబా, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

అంబర్‌పేట: భర్త వేరొక మహిళతో చనువుగా ఉండటాన్ని తట్టుకోలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట తురాబ్‌నగర్‌కు చెందిన ఏర్పుల పూజ (22) రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రతో వివాహమైంది. కాగా వీరికి మూడేళ్ల కుమారుడు సంతానం. కాగా గత కొంతకాలంగా భర్త ప్రవర్తన నచ్చకపోవడంతో మనస్తాపం చెందింది. గురువారం రాత్రి తనగదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

నల్లకుంట: విధులకు వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకలూరిపేటకు చెందిన ఆమర్లపూడి ఉదయ్‌కుమార్, వెంకట్‌సాగర్ (55–60) అనే వ్యక్తి కలిసి రాంనగర్ గుండు సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఉదయ్‌కుమార్ పలుసార్లు వెంకట్‌సాగర్‌ను కుటుంబ వివరాలు అడగగా.. తనకంటూ ఎవరూలేరని, నేను ఒంటరి వాడినని చెప్పేవాడన్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 9 గంటలకు వెంకట్‌సాగర్ పనికి వెళ్లిపోయాడు. అదే సమయంలో ఉదయ్‌సాగర్ కూడా కేటరింగ్ పనులకు వెళ్లిపోయాడు. అడిక్‌మెట్‌లోని వసుంధర కళాశాల వద్దకు చేరుకున్న ఉదయ్‌కుమార్‌ను కలిసిన కొందరు మీ స్నేహితుడు గుండె నొప్పితో కిందపడిపోయాడని చెప్పారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఉదయ్‌కుమార్ స్నేహితుడిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా.. అతను అప్పటికే మృతి చెందాడు. ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



బాగ్‌అంబర్‌పేట్‌లో పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: నియోజకవర్గంలో దశలవారీగా పైప్‌లైన్ పనులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బాగ్అంబర్‌పేట్ డివిజన్‌లో రూ.60 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కోట్లాది రూపాయల నిధులతో రోడ్లు, పార్కులు అభివృద్ధి చేశామన్నారు. జలమండలి అధికారులతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయప్రదాత బీపీ మండల్



నివాళులర్పిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు



నివాళులర్పిస్తున్న ఆనందగౌడ్ తదితరులు

కాచిగూడ: సామాజిక న్యాయప్రదాత బీపీ మండల్ అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శుక్రవారం కాచిగూడలో ఆయన బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దామాషా ప్రకారం ప్రాతినిధ్యం లభించాలన్నారు. బీపీ మండల్ సిఫార్సులతో 27 శాతం విద్య, ఉద్యోగ, రంగాల్లో రిజర్వేషన్లు బీసీలకు అమలులోకి రావడంతోనే మనదేశంలో గొప్ప సామాజిక మార్పునకు బాటలు పడ్డాయన్నారు. ఆధునిక అభివృద్ధిని ఆయా వర్గాల ప్రజలు అందుకోగలుగుతున్నారని వకుళాభరణం తెలిపారు.

అంబర్‌పేట: దేశంలో వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు బీపీ.మండల్ అని నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మహాత్మాజ్యోతిరావు పూలే చౌరస్తాలో బీపీ.మండల్ 105వ జయంతిని ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1979లో కేంద్రం సామాజికంగా, విద్య, ఆర్థికపరంగా వెనుకబడిన వర్గాలను గుర్తించేందుకు వేసిన కమిషన్‌కు బీపీ.మండల్ నేతృత్వం వహించారన్నారు. 1980 నాటికి దేశంలో 52 శాతం ఉన్న ఓబీసీలకు ఆయన నేతృత్వంలో ఇచ్చిన నివేదికను ఇప్పటివరకు ఏ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా బీపీ.మండల్ కమిషన్ నివేదికను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. వివిధ బీసీ సంఘాల నాయకులు మురళీకృష్ణ, వెంకటేష్, మల్లేష్ గంగపుత్ర, లింగంగౌడ్, భాస్కర్, పులి నారాయణ, రాజేష్, కృష్ణముదిరాజ్ తదితరులున్నారు.

సీఎం కేసీఆర్‌తోనే మండల్ కమిషన్ సిఫార్సు సాధ్యం..

నల్లకుంట: సీఎం కేసీఆర్‌తోనే మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడం సాధ్యమని బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర అన్నారు. తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లో తెలంగాణ బీసీ జాగృతి కార్యాలయంలో బీపీ మండల్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఉపేంద్ర బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ. మురళీకృష్ణతో కలిసి బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కత్తుల సుదర్శన్‌రావు, కార్యదర్శి పాతకోటి మహేష్, కార్యవర్గ సభ్యులు ఎంబీ.కిశోర్, ప్రశాంత్ ముదిరాజ్, సురేందర్, రత్నానగర్ బస్తీ నాయకులు వెంకటేష్, జహర్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: పద్మశాలీ సమాజ సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికార వాటా సాధనే లక్ష్యంగా సెప్టెంబర్ 3న ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న పద్మశాలీ శంఖారావం సభను విజయవంతం చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలిభవన్‌లో పద్మశాలీ శంఖారావం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. రాజకీయాలకు అతీతంగా పద్మశాలీలు అందరూ కుటుంబసమేతంగా పాల్గొని పద్మశాలీల ఐక్యతను చాటాలన్నారు. సిలువేరు సునిత, మిర్యాల విశ్వరేఖ, పద్మ, సంధ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

అంబర్‌పేట: ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు, సవరణ కోసం నేడు, రేపు ఈ నెల (26, 27)న ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతి దివాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ బూత్‌లెవెల్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు, సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని డీఎంసీ తెలిపారు.

టెన్నిస్ కోర్టుల్లో సౌకర్యాల కల్పనకు కృషి



క్రీడాకారులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌నేత ముఠా జైసింహ

ముషీరాబాద్: ఇందిరాపార్కులో నూతనంగా నిర్మించిన టెన్నిస్‌కోర్టులో కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శుక్రవారం ఇందిరా పార్కులో టెన్నిస్ కోర్టు క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్ నేతలతో కలిసి నూతనంగా నిర్మించిన టెన్నిస్ కోర్టును సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన గేట్‌లో ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో పిచ్చి మొక్కలు, చెత్తచెదారం పేరుకుపోయాయని క్రీడాకారులు జైసింహ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన తనవంతు చర్యలు తీసుకుంటానని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, బీఆర్ఎస్ నేతలు డాక్టర్ శ్రీహరి, దుర్గాస్వామి, సత్యనారాయణ, సాయి, రామిరెడ్డి, ముఖేష్‌రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్‌కు పోటాపోటీ



భార్య మాధవికి టికెట్టు కేటాయించాలని దరఖాస్తు చేస్తున్న, కాంగ్రెస్ నేత బిజ్జి శత్రు

ముషీరాబాద్: నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు నాయకులు పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు పోటీ చేసే అభ్యర్థులు రూ.50 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కోరడంతో కాంగ్రెస్ పార్టీ టికెట్టు ఆశిస్తున్న 6 మంది ఆశావాహులు పోటీకి ముందుకొచ్చారు.

తండ్రికొడుకుల మధ్య సస్పెన్స్‌కు తెర...

- మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, ఆయన కుమారుడు, అనిల్‌కుమార్‌యాదవ్‌లలో ఎవరు పోటీ చేస్తారన్న దానిపై సస్పెన్స్ నెలకొంది.
- నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో ఇద్దరు పాల్గొనడం, వచ్చే ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తారన్న దానిపై స్పష్టత రాకపోవడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.
- దరఖాస్తు తేదీ చివరిరోజున అంజన్‌కుమార్‌యాదవ్ ఒక్కడే దరఖాస్తు చేసుకోవడం, అనిల్‌కుమార్‌యాదవ్ డ్రాప్ కావడంతో సస్పెన్స్‌కు తెరపడింది.

6 మంది పోటీదారులు వీరే...

- ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ మొదటి వరుసలో ఉన్నారు. సంగిశెట్టి జగదీష్ 2004లో లోక్ జన్ శక్తి పార్టీ తెలంగాణశాఖను కాంగ్రెస్‌లో విలీనం చేసి అప్పటి దివంగత సీఎం వైఎస్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.
- నగేష్‌ముదిరాజ్ గత 30 ఏళ్లుగా యువజన కాంగ్రెస్ నాయకుడిగా అనేక హోదాల్లో పనిచేస్తూ.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అనుచరుడిగా కొనసాగుతున్నారు. అనేక ఉప ఎన్నికల్లో ఆయా నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా కూడా పని చేశారు. తరువాతి స్థానాల్లో ఏఐసీసీ ఫిషర్‌మెన్ సెల్ కార్యదర్శి బిజ్జి శత్రు సతీమణి బిజ్జి మాధవిరావు, ట్రేడ్‌యూనియన్ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లబెల్లి అంజిరెడ్డి, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కృపారావు కుమారుడు జాన్ కెన్నాడీ తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. టి.అంజయ్య, టి.మణెమ్మ కుటుంబం నుంచి ఒకరు కూడా దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం.